క్లుప్తంగా

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

వేమూరు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని వేమూరు నియోజకవర్గం ప్రత్యేకాధికారి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బొంత అర్జునరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లోని పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమీక్ష నిర్వహించారు. బాపట్ల జిల్లాలో వేమూరు నియోజకవర్గం గృహ నిర్మాణాల్లో చాల వెనుకబడి ఉందని ఆయన తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించేలా కృషి చేయాలని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు, సచివాలయం సిబ్బంది సమన్వయంతో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ ప్రాజెక్ట్ అధికారి ప్రసాద్, పీఆర్ ఏఈ జె.హరిరామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ విద్యాసాగర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులు అందజేత

భట్టిప్రోలు: భట్టిప్రోలు-1 సచివాలయం పరిధిలో సుగుణ బాబ్జి(33) అనారోగ్యంతో మృతి చెందడంతో అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.10వేలు నగదు మట్టి ఖర్చుల నిమిత్తం మంగళవారం అందజేశారు. మృతుని తల్లి లక్ష్మికి నగదును సర్పంచ్ దారా రవికిరణ్మయి ఇచ్చారు. వార్డు సభ్యులు పెరికల శ్యామ్ సుందర్, అబ్దుల్ కరీమ్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు వాగోలు సురేష్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

దళిత ఉద్యోగుల సంక్షేమానికి కార్యాచరణ

బాపట్ల: దళిత ఉద్యోగుల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకుపోతామని మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ పేర్కొన్నారు. బాపట్లలోని ఏకో హాస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలంతో పేబ్యాక్ టు సొసైటీ నినాదంతో ముందుకుపోతామని తెలిపారు. రాష్ట్రమంతా పర్యటిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు గద్దల రామదాస్, పులి శేషగిరి, బక్కా రాజ్‌కిరణ్, మానుకొండ రత్నకుమార్, రేవూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

12న వైఎస్సార్ స్మారక స్పీడ్ సైకిల్ పోటీలు



బాపట్ల: డాక్టరు వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారక రాష్ట్ర స్థాయి స్పీడ్ సైకిల్ పోటీలు నవంబరు 12న నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు గాదె మధుసూదనరెడ్డి తెలిపారు. స్థానిక పటేల్ నగర్‌లోని గాదె నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరపత్రాలను ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని పిట్టలవానిపాలెంలో ఈ సైకిల్ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లం గోపికృష్ణ, జిట్టా శ్రీనివాసరావు, గిరిజారాణి, డేగల రవిరెడ్డి, ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

లారీని ఢీకొని డ్రైవర్‌కు గాయాలు



కర్లపాలెం: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొనటంతో క్యాబిన్ ధ్వంసమై డ్రైవర్‌కు స్వల్ప గాయాలైన ఘటన కర్లపాలెంలో చోటు చేసుకుంది. స్థానికులు వివరాల మేరకు.. కర్లపాలెంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి పీడీఎఫ్ బియ్యం లోడుతో వేమూరు వైపు వెళ్తున్న లారీ వెళ్తోంది. బియ్యం బస్తా జారీ జాతీయ రహదారిపై పడటంతో డ్రైవర్ లారీని రోడ్డుపై ఆపాడు. అదే సమయంలో బాపట్ల వైపు నుంచి కర్లపాలెం వైపు వస్తున్న మరొక లారీ ఆగిఉన్న లారీని ఢీకొనింది. దీంతో లారీ క్యాబిన్ ధ్వంసమై డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనలో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవటంతో స్థానికులు డోర్ పగలకొట్టి అతనిని బయటకు తీశారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్లేస్‌మెంట్ బ్రోచర్ల ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పలు కళాశాలల ప్లేస్‌మెంట్ బ్రోచర్లను మంగళవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల పూర్తి సమాచారంతో రూపొందించిన ప్లేస్‌మెంట్ బ్రోచర్లు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు సులభంగా లభించేందుకు దోహదం చేస్తాయన్నారు. యూనివర్సిటీ హెచ్ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల, ఆర్కిటెక్చర్ కళాశాల, వ్యాయామ విద్య కళాశాలల బ్రోచర్లు ఆవిష్కరించడం జరిగిందన్నారు. బ్రోచర్లను ఆయా కంపెనీలకు పంపినట్లు తెలిపారు. రెక్టార్ ఆచార్య, ప్రిన్సిపాల్స్ పి.సిద్ధయ్య, ఆచార్య పి.జాన్సన్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

మంగళ గౌరీ నమోస్తుతే...

రేపల్లె రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని పలు దేవాలయాలలో మూడవ రోజు మంగళవారం అమ్మవార్లు మంగళ గౌరిగా, గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఓల్డ్ టౌన్‌లో వేంచేసియున్న గ్రామ దేవత శ్రీ బూరుగులమ్మ, ఇసుకపల్లిలోని స్వయం భూ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో భ్రమరాంబ అమ్మవారు భక్తులకు మంగళగౌరిగా దర్శనమిచ్చారు. పేటేరు గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవత శ్రీ మహాలక్ష్మి గుండె పాటిమ్మ అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. స్వయం భూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన బతుకమ్మ అమ్మవారి వద్ద మహిళలు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి లలితా సహస్ర నామ పారాయణం, కనక దుర్గమ్మ స్తోత్రాలు పఠించారు. అదే విధంగా అరవపల్లి రహదారిలో దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో నెలకొల్పిన కనకదుర్గమ్మ విగ్రహానికి భక్తులు విశేష పూజలు చేశారు. ఆయా దేవాలయాలు కమిటీల సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

పిట్టలవానిపాలెం: మండలంలోని పలు దేవాలయాల్లో మంగళవారం దేవీ శరన్నవరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అల్లూరు శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మహాలక్ష్మీ దేవిగా అమ్మవారిని అలంకరించారు. చందోలు గ్రామంలోని లింగోద్భవస్వామి దేవాలయంలో అన్నపూర్ణాదేవిగా, బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవార్లు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో చందోలు బండ్లమ్మ దేవాలయ కమిటీ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, అల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి పాల్గొన్నారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు: భట్టిప్రోలు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం అమ్మవారు చంద్ర ఘంట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గా మాత మూడు నేత్రాలు, పది భుజాలతో పులి వాహనంపై ధగధగలాడుతూ ప్రకాశించారు. పూజా కార్యక్రమాలను దండిభొట్ల రాజేంద్రప్రసాద్ మురళి నిర్వహించారు. ఈఓ దీవి వెంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. వెల్లటూరులో అశ్వత్థనారాయణ మహాలక్ష్మి దేవతా వన వృక్షం వద్ద శ్రీ కనకదుర్గ అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక భోగేశ్వర పేటలో కనకదుర్గమ్మ విగ్రహానికి ఆరేపల్లి శంకరావు దంపతులు పూజలు నిర్వహించారు. అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి, పార్వతీ అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు.

అన్నపూర్ణాదేవిగా..

కొల్లూరు: కోటిపల్లి సోమశేఖరాలయంలో సత్యజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరనలో భక్తులకు దర్శనమిచ్చారు. కొల్లూరు పార్వతీ అమ్మవారి ఆలయంలో గాయత్రి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆవులవారిపాలెం, పెసర్లంక, చిలుమూరు, అనంతవరం, క్రాప, కొల్లూరు కనకదుర్గ ఆలయం, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.



చందోలు బండ్లమ్మ శ్రీ మహాలక్ష్మీదేవిగా దర్శనం



అల్లూరు శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు మహాలక్ష్మీదేవిగా..



ఇసుకపల్లిలో మంగళగౌరిగా భ్రమరాంబ



భట్టిప్రోలులో భ్రమరాంబ అమ్మవారు



రేపల్లెలో మంగళగౌరిగా శ్రీ బూరుగులమ్మ..



రామలింగేశ్వరస్వామి ఆలయంలో బతుకమ్మ పూజలు

పేదలకు వరం..జగనన్న ఆరోగ్య సురక్ష

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

మోదుకూరు(వేమూరు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరంలాంటిదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. రాష్ట్రంలో ఇంత వరకు ఇలాంటి కార్యక్రమం చేపట్టిన దాఖలాలు గతంలో లేవని మంత్రి నాగార్జున పేర్కొన్నారు. మోదుకూరు గ్రామంలో 730 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టరు సింధూరి, రమేష్, శ్రావణి, తిరుపతిరెడ్డి, ఎంపీపీ జాలాది రూబేను, అళ్ల వెంకట రమణారెడ్డి, సర్పంచ్ ఎం.శాలి, పార్టీ మండలాధ్యక్షుడు అన్నపరెడ్డి రఘురామిరెడ్డి, చుండూరు గ్రామ సర్పంచ్ ఉయ్యూరి అప్పిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాదె శివరామకృష్ణా రెడ్డి, అన్నపరెడ్డి వీరారెడ్డి, ఎంపీడీవో సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

చెరుకుపల్లి: వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రజా ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని బాపట్ల జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాంబొట్లపాలెం సర్పంచ్ చీరాల ప్రసాద్‌రెడ్డి అన్నారు. రాంబొట్లపాలెం సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. డాక్టర్లు గ్రామంలోని 463 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను ప్రసాద్ రెడ్డి అధికారులతో కలసి పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని జెడ్పీ సీఈఓ జె. మోహన్ రావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంఈఓ టి.నవీన్‌కుమార్, వైద్యులు రవి ప్రకాష్, సాలేహా జుబేదార్, స త్యేంద్ర సాయి, అనురాధ, పంచాయతీ కార్యదర్శి విజయానంద్ పాల్గొన్నారు.

327 మందికి వైద్య పరీక్షలు

రేపల్లె: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మండలంలోని బేతపూడి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. మోళ్లగుంట పీహెచ్‌సీ వైద్యులు 327 మందికి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ ఫరిద్, వైఎస్సార్ సీపీ నాయకులు బొర్రా శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేడు ఉప్పూడిలో వైద్య శిబిరం

రేపల్లె: ఉప్పూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివపార్వతీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆంధ్రరత్న మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 23, 25 వార్డుల ప్రజలకు వైద్య శిబిరం జరుగుతుందని కమిషనర్ విజయసారథి తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

కొల్లూరు : మండలంలోని క్రాపలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 501 మందికి వివిధ రకాల ఆరోగ్య, కంటి చూపు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు వైద్య శిబిరాన్ని పరిశీలించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైస్ సర్పంచి అంకమ్మరావు, మాజీ సర్పంచి వీరరాఘవయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, ఎంపీడీఓ సత్యనారాయణరావు, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, వైద్యులు బి. రాజ్‌కుమార్, ఎస్.సుష్మ,వి.కావ్యతేజ,మౌనిక,పావనిపాల్గొన్నారు.

సురక్షలో మెరుగైన వైద్యం

దమ్మనవారిపాలెం(కర్లపాలెం): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డాక్టర్లు ప్రజలకు మెరుగైన వైద్యం అందించటంతో పాటు నాణ్యమైన మందులు ఇస్తున్నారని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మంగళవారం దమ్మనవారిపాలెంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ దేశంలో లేని విధంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజల కోసం ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించారని చెప్పారు. ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సురక్ష పథకంతో ప్రజలందరికీ ఉచితంగా వైద్యం చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గురపుసాల వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, తహసీల్దారు కేశవనారాయణరావు, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

పాంచాళవరం(వేమూరు): అమర్తలూరు మండలంలోని పాంచాళవరం గ్రామంలో మంగళ వారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున వైద్య శిబిరాన్ని పరిశీలించారు. డాక్టరు పి.శృతి మౌనిక, డాక్టరు కిరణ్, డాక్టరు అశ్విని 400 మందికి వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, లాం బోస్ బాబు, అమిరే రత్నకర్, నారాయణ, మండల ప్రత్యేకాధికారి దేవరాజు పాల్గొన్నారు.

బలిజేపల్లిలో వైద్య శిబిరం

బలిజేపల్లి(వేమూరు): బలిజేపల్లి గ్రామ సచివాయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 321 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకట సురేష్, డాక్టర్లు రవళి, కోటేశ్వరి, వెంకటేష్ నాయక్ వైద్య సేవలందించారు.



మోదుకూరులో బీపీ పరీక్షించుకుంటున్న మంత్రి మేరుగ నాగార్జున



దమ్మనవారిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘుపతి



క్రాపలో వృద్ధురాలికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు



సురక్ష కిట్‌లను పంపిణీ చేస్తున్న ప్రసాద్‌రెడ్డి, అధికారులు



బేతపూడిలో మందుల పంపిణీ

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదోడికి మెరుగైన వైద్యం

బాపట్ల: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మరుప్రోలువారి పాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మెడికల్ కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు కోకి రాఘవ రెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, ఎంపీడీఓ రాధాకృష్ణ, పార్టీ నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, రావి వెంకన్న, ఏడుకొండలురెడ్డి ఉన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి



పెదపల్లి గోల్లపాలెంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

నగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకే గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని పెదపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని పెదపల్లి గోల్లపాలెం, దేవరకొండ పాలెం, లంకమాల పల్లి గ్రామాలలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. వరి పంటకు సాగునీరు అందించాలని, వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్తులు ఎంపీకి వివరించారు. సాగునీటిని అందించాలని ఇరిగేషన్ అధికారులను, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం ఎంపీ మోపిదేవి మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా కూడ రాజకీయాలకు తావు లేకుండా ప్రతి ఇంటికి రూ.3 నుంచి రూ.4 లక్షలను అందించినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా సంక్షేమ పథకాలతో సంతోషంగా జీవిస్తున్నామని ప్రజలు చెబుతున్నారన్నారు. 600 గడపలకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ఎంపీ మోపిదేవి ప్రజలకు వివరించారు. ఆయన వెంట ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, ఎంపీటీసీ కేసన లక్ష్మీ భ్రమరాంబ, వైఎస్సార్ సీపీ నాయకులు బెల్లంకొండ పోలేరు వెంకట్రామయ్య, శ్రీను, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తితో ఆర్థిక వృద్ధి సాధించాలి

కుట్టు మిషన్లు పంపిణీ చేసిన మంత్రి మేరుగ



కుట్టు మిషన్ అందజేస్తున్న మంత్రి నాగార్జున

వేమూరు: మహిళలు చేతి వృత్తి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండలానికి చెందిన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అనేక పథకాలు తీసుకొచ్చారని తెలిపారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పించిందని మంత్రి పేర్కొన్నారు. మండలంలోని 15 మంది మహిళలకు 9 రోజుల శిక్షణ ఇచ్చారు. మిషన్‌తో పాటు సర్టిఫికెట్లు వారికి అందజేశారు. మళ్లీ శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. వాసవి మహిళా మండలి స్వచ్ఛంద సంస్థ ద్వారా మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, పార్టీ మండలాధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు, మార్కెట్ యార్డు చైర్మన్ ఉప్పు శిరీషా, దున్నా మేరీసుబాబు, ఉషా ఇంటర్‌నేషనల్ డిప్యూటీ మేనేజరు టి.రాజకుమార్, కార్యదర్శి యర్రు సాంబశివరావు, శివయ్య పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కొల్లూరు: పేకాట శిబిరంపై దాడి చేసి, ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్న ఘటన సోమవారం రాత్రి జరిగింది. కొల్లూరు పోలీసుల వివరాల మేరకు.. గాజుల్లంక - పోతార్లంక గ్రామాల నడుమ కృష్ణా నది ఒడ్డున పేకాట నిర్వహిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు. తమ సిబ్బందితో దాడి చేసి, ఏడుగురు జూదరునలు అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.4,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు. నిందితులను తెనాలి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు చెప్పారు.

కోడి పందెం స్థావరంపై..

కొల్లూరు: కోడి పందేలు నిర్వహిస్తున్న వారిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సుగ్గున లంక కృష్ణా నది పరిసర ప్రాంతాల్లో జోరుగా కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తన సిబ్బందితో కలసి దాడులు చేశారు. పోలీసుల రాకను గమనించిన కొందరు పరారవ్వగా.. 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి నుంచి రూ.2,900 నగదు, మూడు పందెపు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ రాజ్యలక్ష్మి తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు దుర్మరణం



పిట్టలవానిపాలెం: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. చందోలు ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు పిట్టువారిపాలెం గ్రామానికి చెందిన పిట్టు మణికంఠారెడ్డి (33) గ్రామం నుంచి ప్రధాన రహదారిలోకి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో రెడ్డిపాలెం వైపు నుంచి ఖాజీపాలెం వైపు వెళ్తున్న మినీ లారీ అతనిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయాలైన మణికంఠా రెడ్డిని వైద్యశాలకు తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో చనిపోయాడు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

27న ఓటరు ముసాయిదా జాబితా విడుదల

వేమూరు: ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను నియోజకవర్గ ఎన్నికల అధికారి జె.మోహనరావు కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న ఓటరు ముసాయిదా జాబితా విడదల చేయడం జరుగుతుందన్నారు. దీనిపై అభ్యంతరాలుంటే తన దృష్టికి తీసుకొని రావాలని మోహనరావు చెప్పారు. వేమూరు నియోజకవర్గానికి స్ట్రాంగ్ రూమ్ స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదన పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు, ఎంపీపీ యల్లమాటి మోహన్, గాదె శివరామకృష్ణారెడ్డి, దున్నా మేరీసుబాబు, దొప్పలపూడి జ్యోతిబాబు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరుఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేవీపీ కాలనీకి చెందిన షేక్ లాహెరా సెల్‌ఫోన్‌కు ఇటీవల వాట్సాప్‌లో లింక్ వచ్చింది. లింక్ ఓపెన్ చేయగా అవతలవారు టాస్క్ ఇచ్చారు. రూ. వెయ్యి చెల్లించి టాస్క్ పూర్తి చేస్తే రూ.1400 చెల్లిస్తామని చెప్పారు. లాహెరా మొదట టాస్క్ పూర్తి చేయడంతో రూ. 1400 వచ్చాయి. అనంతరం రూ. 3వేలు చెల్లించాలని గ్రూపు నిర్వాహకులు చెప్పారు. లాహెరా రూ. 3వేలు చెల్లించి టాస్క్ పూర్తి చేసింది. అయితే టాస్క్ పూర్తి కాలేదని గ్రూపు నిర్వాహకులు మెసేజ్ ఇచ్చి మరికొంత చెల్లించాలంటూ పలుమార్లు కోరారు. లాహెరా మెసేజ్‌లో వచ్చిన ప్రకారం మొత్తం రూ.79వేలు చెల్లించింది. తనకు రావాల్సిన డబ్బులు నిర్వాహకులు ఇవ్వకపోడంతో తాను మోసపోయినట్లు గుర్తించి, బాధితురాలు మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

పట్నంబజారు: ఆటోడ్రైవర్‌పై దాడిచేసిన వారిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాధాకృష్ణ థియేటర్ సమీపంలో ఆటోస్టాండ్‌లో షేక్ బాషా అనే వ్యక్తికి సభ్యత్వం ఉంది. ఈక్రమంలో మంగళవారం గుర్తుతెలియని మరో ఆటోడ్రైవర్ స్టాండ్ వద్ద ఆటోను నిలిపాడు. బాషా స్టాండ్‌కు అడ్డంగా ఉన్న ఆటోను తొలగించాలన్నాడు. పూటుగా మద్యం సేవించి ఉన్న గుర్తుతెలియని ఆటోడ్రైవర్ బాషాను దుర్భాషలాడడంతోపాటు, రాడ్‌తో దాడిచేశాడు. బాషాకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.